సాక్షి
నారాయణపేట
శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



.. పునశ్చరణ తరగతులు

ఉమ్మడి జిల్లాలోని అర్చకులకు ఆదివారం నుంచి పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు.

వివరాలు 8లో ▸



నేడు స్టేడియం ప్రారంభం

మహబూబ్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాన్ని శనివారం ప్రారంభించనున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /23.2

వాతావరణం

ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

4న మక్తల్‌కు మంత్రి హరీశ్‌రావు రాక

నారాయణపేట: అక్టోబర్ 4న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు మక్తల్ పట్టణానికి రానున్నారని కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మక్తల్‌లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు గృహలక్ష్మి, దళితబంధు, మైనారిటీ లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమానికి పార్కింగ్ శానిటేషన్ తదితర అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

అభివృద్ధికి కలిసిరండి

మక్తల్: పేదల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందని.. అభివృద్ధికి కలిసి రావాలని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలం నర్సిరెడ్డిపల్లికి చెందిన సర్పంచ్ అనితతోపాటు కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నాయకుల, కార్యకర్తలు దాదాపు 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని.. అంరదూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో మహిపాల్‌రెడ్డి,బాల్‌రాజు, సర్పంచు ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాజీ మంత్రి గుడ్‌బై



కల్వకుర్తి రూరల్: ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడు కృషి చేశానని, అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును ఓడించి చరిత్ర సృష్టించానని మాజీ మంత్రి చిత్తరంజన్ దాసు అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలో తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని, అయితే ప్రజలకు సేవ చేయాలనుకున్న తన లక్ష్యం నెరవేరకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ సూచనలు, సలహాలు ఎవరు తీసుకోవడం లేదని, అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలనే చెప్పడానికి, ఇవ్వడానికి ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకని ప్రశ్నించారు. తనకు విలువ, గౌరవం ఇవ్వని పార్టీలో ఉండకూడదనే ఆలోచనతో రాజీనామా చేశానని తెలిపారు. ప్రపంచ దేశాలలో బలమైన నేతగా గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు దేశాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథం వైపు తీసుకెళుతున్న ప్రధాని నరేంద్రమోదీ అడుగుజాడల్లో నడిచేందుకు బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాయలయంలో అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. శేఖర్, రామాంజనేయులు, అంజియాదవ్, శ్రీశైలం ముదిరాజు, రాము, సత్యం, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ పీఓ పరీక్షకు ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్‌బీఐ పీఓ పరీక్షకు సంబంధించి మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. నాన్-రెసిడెన్షియల్ కింద 30రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వచ్చే నెల 7వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులు తమ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.7993357089, 7382713597, 9052522696లలో సంప్రదించవచ్చని తెలిపారు.

రాష్ట్రస్థాయిలో విజేతగా నిలవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో జిల్లా జట్లు ఉత్తమ ప్రతిభకనబరిచి చాంపియన్లుగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో శుక్రవారం అండర్-14 విభాగం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ టోర్నీ కం సెలక్షన్స్ నిర్వహించారు. టోర్నీని డీవైఎస్‌ఓ ప్రారంభించి మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. క్రీడల్లో ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం శ్రమించాలని సూచించారు. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో డీఈఓ రవీందర్ పాల్గొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్య నిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

‘కృష్ణా’కు ప్యాసింజర్

కాచిగూడ - కృష్ణా ప్యాసింజర్ రైలుతో ప్రయాణికులకు మేలు



- మాగనూర్, మక్తల్, జక్లేర్, మరికల్ వాసులకు ప్రయాణం సులువు
- దేవరకద్ర నుంచి 66 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్ పనులు పూర్తి
- రేపు రైలును ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

కృష్ణా: ఎట్టకేలకు కృష్ణా రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైలు కూత కూయనుంది. గత ఫిబ్రవరిలో మునీరాబాద్ మహబూబ్‌నగర్ రైల్వేలో భాగంగా దేవరకద్ర నుంచి కృష్ణా వరకు ఉన్న 66 కిలోమీటర్ల దక్షిణ మధ్య రైల్వే లైన్ పూర్తి స్థాయిలో పనులు పూర్తి అయ్యాయి. గత 8 నెలల నుండి గూడ్స్ రైళ్లు ఈ లైన్‌పైనే రాకపోకలు సాగిస్తున్నాయి. కాగా ప్రస్తుతం ఈ ప్రాంత ప్రయాణికుల అవసరాల నిమిత్తం ముందుగా ఈ కాచిగూడ రైలును ప్రారంభించనున్నారు. ఈ రైలుతో ఇటు తెలంగాణ ప్రాంత ప్రజలకే కాకుండా కర్ణాటక, గోవా రాష్ట్రాల వ్యాపారులకు, ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది. హైదరాబాద్ నుంచి ఈ ప్రాంతానికి రోడ్డు మార్గం ద్వారానే వస్తువుల రవాణా ఇప్పటివరకు సాగేది. ప్యాసింజర్ రైలు రాకతో ప్రజలకు నిత్యావసర సరుకుల దిగుమతి విషయంలో ఇబ్బందులు తప్పుతాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులకు హైదరాబాద్ తర్వాత అంతటి మార్కెట్ ఉన్న ప్రాంతం కర్ణాటకలోని రాయచూర్. దీంతో ప్రతినిత్యం వందల సంఖ్యలో రాయచూర్ నుంచి హైదరాబాద్ వరకు వాణిజ్య వాహనాలు రోడ్డు మార్గం గుండానే తమ కార్యకలాపాలు సాగించేవి. ఇప్పుడు అందుబాటులోకి ప్యాసింజర్ రైలు రావంతో హైద్రాబాద్ మార్కెట్‌లో వస్తువులు ఏ ధర ఉన్నాయే ఆ ధరలకే రాయచూర్ పట్టణంలో ఇక మీదట లభించే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా ఈ రైల్వే లైన్ పూర్తి కావడంతో మక్తల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందనుందని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ రైలుతో మాగనూర్, మక్తల్, జక్లేర్, మరికల్ వాసులకు ప్రయాణం సులువు కానుంది.

ఆనందంగా ఉంది



కృష్ణాకు ప్యాసింజర్ రైలు రాకతో ఎంతో ఆనందంగా ఉంది. ఇదిరవకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నిత్యం వ్యాపార నిమిత్తం వెళ్లి రావడం, వస్తువులు తీసుకురావడం ఎంతో ఖర్చుతో కూడుకునేది. రైలు సౌకర్యం అందుబాటులోకి వస్తే.. చాలావరకు ఖర్చులు తగ్గనున్నాయి. కృష్ణకు పూర్వ వైభవం రానుంది. ఇక్కడ వ్యాపారాలు సైతం పుంజుకోనున్నాయి.

– శివరాజ్‌పాటీల్, గుర్జాల్

కల సాకారం



రైల్వే అధికారులు కాచిగూడ నుంచి కృష్ణా జంక్షన్ వరకు నూతనంగా ప్యాసింజర్ రైలును ప్రారంభిస్తున్నాందున ఆనందంగా ఉంది. ఈ ప్రాంత ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లి రావడం ఎంతో సులవవనుంది. వ్యాపార కార్యకలాపాలకు, ప్రజారవాణా మెరుగుపడడంతో పాటు సమయం,డబ్బు ఆదా అవుతుంది. మక్తల్ నియోకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుటకు అవకాశం ఉంది.

– చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే

8 నెలల క్రితమే అందుబాటులోకి..

8 నెలల క్రితమే ఈ రైల్వే లైన్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. మునీరా బాద్ మహబూబ్‌నగర్ రైల్వేలో బాగంగా దేవరకద్ర నుండి కృష్ణా వరకు ఉన్న 66 కిలోమీటర్లు ఉంది. దీనిని 2017లో దేవరకద్ర నుంచి జక్లేర్ గ్రామం వరకు ఉన్న 28.3 కిలోమీటర్లను రూ.943 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేయడం జరిగింది. ఆ తరువాత జక్లేర్ నుంచి మక్తల్ వరకు 11.5 కిలో మీటర్ల రైల్వే లైన్ పనులను 2020లో, మక్తల్ నుంచి మాగనూర్ వరకు ఉన్న 13.3 కిలోమీటర్లను 2022 మార్చిలో, మాగనూర్ నుండి కృష్ణా వరకు ఉన్న 12.7 కిలోమీటర్లను 2023 ఫిబ్రవరిలో పూర్తి చేసి నాటి నుంచి గూడ్స్ రైళ్ల రాకపోకలు ప్రారంభించారు. ఇదిలాఉండగా, కాచిగూడ వయా దేవరకద్ర మీదుగా కృష్ణా జంక్షన్ వరకు ప్యాసింజర్ రైలును ప్రధాని మోదీ అక్టోబర్ 1వ తేదీని ప్రారంభించనున్నట్లు కృష్ణా ఆర్‌ఎస్‌ఎం శశికాంత్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు.



దేవరకద్ర నుంచి కృష్ణా వరకు అధికారులు నిర్వహించిన ట్రయల్ రన్ (ఫైల్)

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

నారాయణపేట: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ శిక్షణ పై నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల అర్హత, అనర్హత, నామినేషన్ నుంచి వారికి గుర్తు కేటాయించే వరకు అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే డిస్ట్రిక్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్, పోలింగ్ స్టేషన్స్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎంసీఎంసీసి స్వీప్, ఈవీఎం వీప్యాట్, ఎలక్షన్ మెటీరియల్ పై వివరించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిత్తల్, ఎస్‌డిసి రాజేందర్‌గౌడ్, ఆర్‌డీఓ రాంచందర్‌నాయక్, డీఆర్‌డీఓ గోపాల్‌నాయక్, డీపీఓ జాన్‌సుధాకర్, డీపీఆర్‌ఓ రషీద్, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన ఐజీ

మహబూబ్‌నగర్ క్రైం/ భూత్పూర్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో ఆదివారం అమిస్తాపూర్ సమీపంలో నిర్వహించనున్న సభా ప్రాంగణంతోపాటు ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించే స్థలాన్ని మల్టీ జోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్, కలెక్టర్ రవినాయక్ శుక్రవారం పరిశీలించారు. ప్రధానంగా భద్రతా ఏర్పాట్లతో పాటు హెలీప్యాడ్ స్థలం, సభావేదిక, వాహనాల పార్కింగ్ స్థలాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఐజీ షానావాజ్ ఖాసీం మహబూబ్‌నగర్‌లోని డీఐజీ కార్యాలయాన్ని సందర్శించారు. వారి వెంట ఎస్పీ కె.నరసింహ, ఏఎస్పీ రాములు, డీఎస్పీ మహేష్ తదితరులున్నారు.

■ బహిరంగ సభ ఏర్పాట్లను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు చింతల రామచంద్రారెడ్డి పరిశీలించారు. హెలీప్యాడ్, సభాప్రాంగణాల్లో చేపడుతున్న పనుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మోదీ సభకు 8 భారీ షెడ్లు, ప్రసంగాన్ని వీక్షించేందుకు భారీ టీవీలను షెడ్లలో ఏర్పాటు చేశారు.

రేపు మహబూబ్‌నగర్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

మహబూబ్‌నగర్ క్రైం: పాలమూరులో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన నేపథ్యంలో జిల్లాలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఎస్పీ కె.నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ పట్టణం నుంచి భూత్పూర్ వైపు వెళ్లే భారీ వాహనాలకు అనుమతి లేదని, కేవలం సమావేశానికి వచ్చే వాహనాలు మాత్రమే అమిస్తాపూర్ శివారులోని సాక్షిగణపతి ఆలయం దగ్గర ఇరువైపులా గల పార్కింగ్ ప్రదేశాల్లో పార్క్ చేయాలన్నారు. మహబూబ్‌నగర్ నుంచి భూత్పూర్ వైపు వెళ్లే వాహనాలకు అనుమతి లేని కారణంగా మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల జాతీయ రహదారి నుంచి హైదరాబాద్ లేదా కర్నూలు వైపు వెళ్లాలన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఎకో పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: జిల్లా కేంద్రానికి రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ శనివారం రానుండగా.. ఈమేరకు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మంత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి 9.30 గంటలకు నారాయణపేటకు చేరుకుంటారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముందుగా సయ్యద్ షా తఖీ బాబా దర్గాలో పూజలు నిర్వహించి, సుభాష్‌రోడ్‌లోని అషూర్‌ఖాన భూమి పూజ, 10వ వార్డులో బీబీ దర్గా ఎదురుగా ఖబ్రాస్తాన్‌కు ప్రహరీగోడకు శంకుస్థాపన, ఎక్లాస్‌పూర్‌లో రూ. 2 కోట్లతో చేపట్టిన ఏకో పార్కును ప్రారంభించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం అంజనా గార్డెన్‌లో కేసీఆర్ తోఫా ఖాతుర్ ఖా భరోసా పథకం కింద పేద మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు అందించడం జరుగుతుందని, ఆ తర్వాత మంత్రి మాట్లాతారన్నారు. ఎమ్మెల్యేతో పాటు జడ్పీ కో అప్షన్ సభ్యులు తాజుద్దీన్, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు మహిమూద్, సలీం, దస్తగీర్ చాంద్, నవాజీమూసా, సర్ఫరాజ్ అన్సారీ, ఫిరోజ్ చాంద్ ఉన్నారు.

నేడు జిల్లాకు హోంశాఖ మంత్రి రాక

జిల్లా కేంద్రానికి శనివారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర హోంశాఖ మంత్రి మహిమూద్ అలీ రానున్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించే ఆషుర్‌ఖానా శంకుస్థాపన, ఎకోపార్కు ప్రారంభం తదితర అభివృద్ధి పనుల్లో ఆయన పాల్గొననున్నారు.

ప్రధానికి తెలంగాణ అంటే అక్కసు : మంత్రి

హన్వాడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తెలంగాణ అంటే అక్కసు వెళ్లగక్కుతున్నారని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గతంలో మహబూబ్‌నగర్ పర్యటన సందర్భంగా బహిరంగ సమావేశంలో మాట్లాడుతూ పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చారని.. ముందు ఆ హామీని నెరవేర్చి తెలంగాణ గడ్డపై కాలుమోపాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండలంలోని ఎల్లంబాయితండా, శేక్‌పల్లి, కిష్టంపల్లి, గొండ్యాల్, కిష్టంపల్లిగేట్, ఎర్రగుట్టతండా, మునిమోక్షం, అమ్మాపూర్, నాగంబాయితండా, మాధారం, యారోనిపల్లి గ్రామాల్లో పర్యటించి.. చెక్‌డ్యాంలు, రోడ్లు, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుపైనే విమర్శలు చేసిన ప్రధాని తమ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తారని ఎలా ఆశిస్తామని ఎద్దేవా చేశారు. డిక్లరేషన్ల పేరిట కాంగ్రెస్ నాయకులు ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని విమర్శించారు. అనంతరం గొండ్యాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో బాలికలకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు.

పాలమూరులో సిరుల పంటలు



వనపర్తిలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన మహిళలు

రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్

- మైగ్రేషన్‌ను మరిపించేలా ఇరిగేషన్‌ను తీర్చిదిద్దాం
- స్వరాష్ట్ర పాలనలో ఉన్నత విద్యను చేరువ చేశాం
- వలస కూలీలను పట్టించుకున్న సీఎం ఒక్కరైనా ఉన్నారా..?
- గ్యారంటీ స్కీంలు అంటూ వచ్చే నాయకులను నమ్మొద్దు
- వనపర్తి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం



అభివాదం చేస్తున్న కేటీఆర్

వనపర్తి: ఏటా సుమారు 14 లక్షల మంది పొట్టకూటి కోసం వలస వెళ్లే పాలమూరును పదేళ్ల స్వరాష్ట్ర పాలనలో సిరుల పంటలు పండేలా తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. శుక్రవారం ఆయన వనపర్తి జిల్లాకేంద్రంలో రూ.669.67 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వనపర్తి పదేళ్ల ప్రగతి మహాసభలో మాట్లాడారు. పాలమూరులో వలసలను రూపుమాపి.. జిల్లాకే వలసలు వచ్చేలా జనజీవనాన్ని వృద్ధి చేశామన్నారు. జీవనది కృష్ణానది పక్కనే నెర్రెలుబారిన పంట పొలాలతో రైతుల కడుపుకోతను చూడలేక స్వరాష్ట్ర పాలన కావాలనే సీఎం కేసీఆర్ గులాబీ జెండా ఎత్తుకునే వరకు ఏ నాయకుడు పాలమూరు వలసల గురించి ఆలోచించలేదని ఎద్దేవా చేశారు. వలసలను ఆపడంపై ఏ ముఖ్యమంత్రి దృష్టి సారించారో చెప్పాలని ప్రశ్నించారు. పక్క రాష్ట్రాల పట్టణాల్లో ప్రతి పనిలో పాలమూరు ప్రజలే కనిపించేవారని.. ఆ పాపం 11 సార్లు రాష్ట్రంలో అధికారం అనుభవించిన కాంగ్రెస్‌ది కాదా అని ప్రశ్నించారు. అధికారం కోసం ఆరు గ్యారంటీ స్కీంలు అంటూ ఓట్లను నోట్లకు కొనే నాయకులు మీ వద్దకు వస్తే ఓటు వేయొద్దన్నారు. చుట్టపోళ్ల చావుకెళ్తే.. స్నానానికి కరెంట్ ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులను అడుక్కునే దీనస్థితి ఉండేదని ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ఆర్డీఎస్ తూములు పగులగొట్టి నీళ్లు తీసుకుపోతుంటే వ్యాసాలు రాసిన నాయకులకు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రైతులను ఆదుకునేందుకు పెట్టుబడి సాయం ఇవ్వాలనే ఆలోచన గత పాలకులకు ఎందుకు రాలేదని నిలదీశారు. స్వరాష్ట్ర పాలనలో ఒక్క వనపర్తి నియోజకవర్గంలోనే.. 1.25 లక్షల ఎకరాలకు సాగునీరొచ్చిందని గుర్తుచేశారు. జూనియర్, డిగ్రీ కళాశాలల మంజూరు కోసం ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్, అగ్రికల్చర్ డిగ్రీ కళాశాలలు తెచ్చి.. ఉన్నత విద్యను చేరువ చేశామన్నారు. నిరంజన్‌రెడ్డి అభివృద్ధి విషయంలో మా ప్రాంతాలతో పోటీపడుతున్నారు. మీరు ఎన్నికల్లో మాకు వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ ఇచ్చేందుకు పోటీపడాలని కేటీఆర్ ప్రజలను కోరారు.


■ నాలుగుసార్లు వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన చిన్నారెడ్డి తాను చేయలేని రోడ్ల విస్తరణ, ఎండిన కాల్వలకు సాగునీరు తీసుకువచ్చిన నిరంజన్‌రెడ్డిపై సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సర్కారు వైద్యం, విద్య అంటే ప్రజల్లో ఉన్న భయాన్ని నేను రాను బిడ్డో అనే పరిస్థితుల నుంచి ప్రస్తుతం నూటికి 70 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసే స్థాయికి తీసుకువచ్చామన్నారు. ప్రతి జిల్లాకేంద్రంలో మెడికల్ కళాశాల, 300 పడకల ఆస్పత్రి నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.

రూ. 22 కోట్లతో ఐటీటవర్

జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా వనపర్తిలో ఐటీ టవర్ నిర్మాణానికి రూ.22 కోట్లు మంజూరు చేస్తూ జీఓ తీసుకువచ్చారని మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలు గ్రామాల నుంచి పెద్దఎత్తున సభకు తరలివచ్చిన ప్రజలకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సభను చూస్తుంటే జిల్లాకు దసరా పండగ ముందుగానే వచ్చినట్లుందన్నారు. కలెక్టర్ తేజాస్ నందలాల్‌పవార్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఒకేరోజు భారీ ఎత్తున అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లోనూ.. జిల్లా అభివృద్ధికి మంత్రులు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీలు రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, అదనపు కలెక్టర్ తిరుపతిరావు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రజిని, మాజీ ఎంపీ మంద జగన్నాథం, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు.. శంకుస్థాపనలు

ఉదయం 11.25 గంటలకు కొత్తకోట మండలంలోని సంకిరెడ్డిపల్లి వద్దకు చేరుకున్న మంత్రి కేటీఆర్ అక్కడే ఆయిల్‌పాం ప్రాసెసింగ్ యూనిట్ ఫ్యాక్టరీకి భూమిపూజ చేశారు. అనంతరం పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద మిషన్ భగీరథ మోటారు ప్రారంభించారు. రాజపేట వద్ద 96 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, నాగవరం శివారులో ప్రొఫెసర్ జయశంకర్ రాక్ గార్డెన్, షాదీఖానా, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం పక్కన డైనింగ్ హాల్, అనుబంధ భవనాలను ప్రారంభించారు. భూసార పరీక్షల ప్రయోగశాల, బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, ఐటీహబ్, జంతు సంరక్షణ యూనిట్, కృష్ణదేవరాయ పాలిటెక్నిక్ కళాశాల పునర్నిర్మాణం, బాలుర, బాలికల హాస్టల్ భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే జిల్లాకేంద్రంలో సురవరం ప్రతాపరెడ్డి జిల్లా గ్రంథాలయం, పీర్లగుట్టపై 294 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాల ప్రారంభం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వనపరి- పెబ్బేరు బీటీ, బైపాస్ రోడ్డుతోపాటు జిల్లాకేంద్రంలో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.



మిషన్ భగీరథ నల్లాను తిప్పి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి



విలేకరులతో మాట్లాడుతున్న డీకే అరుణ

నారాయణపేట రూరల్: కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే సర్కారు ఉండాలని.. అప్పుడే అభివృద్ధి పరుగులు పెడుతుందని.. అది కూడా బీజేపీ ప్రభుత్వం కావాలని డీకే అరుణ అన్నారు. పట్టణంలోని ఆర్‌పీఆర్ గెస్ట్ హౌజ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అక్టోబర్ 1న ప్రధాని నరేంద్రమోది పాలమూర్ జిల్లాకు రానున్నారని, రూ.13,545కోట్ల పనులకు శంకుస్థాపనలు, పూర్తి అయిన వాటిని ప్రారంభిస్తారని చెప్పారు. భూత్పూర్ దగ్గర బీజేపీ నిర్వహిస్తున్న బహిరంగసభకు జిల్లా ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కాచీగూడ నుంచి కృష్ణ రైల్వేలైన్ పూర్తి కావడంతో మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఆ రూట్‌లో తొలి రైలును ఆయన ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం హసల్ నుంచి చర్లపల్లి వరకు హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభిస్తారన్నారు. జిల్లా ప్రజలు బీజేపీని ఆదరించాలని.. వలసల నివారణ, సాగునీరు అందించడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, వికారాబాద్ - కృష్ణ రైల్వేలైన్ నిర్మాణం పూర్తి చేయడంతో పాటు మరికల్ నుంచి నారాయణపేట మీదుగా యాద్గీర్ వైపు జాతీయ రహదారి తీసుకుని వస్తామన్నారు. జీఓ 69 అమలు చేసి జిల్లాకు సాగునీరు అందిస్తామన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను నమ్మొద్దు

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల జిమ్మిక్కులో భాగంగా అమలు సాధ్యం కాని హామీలను ప్రకటిస్తున్నారని, ప్రజలు నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. పాలమూరు -రంగారెడ్డి డిజైన్లను ఇష్టారీతిగా మార్చి కమీషన్లకు తెరలేపిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క మోటార్ ప్రారంభించి ప్రాజెక్టు పూర్తి అయ్యిందని మభ్యపెడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతోనే డీపీఆర్‌ల మార్పుతో జాతీయ హోదాకు అర్హత పొందలేదని, అనవసరంగా బీజేపీపై నిందలు మోపడం సరికాదన్నారు. సమావేశంలో నాగురావునామాజి, రతంగపాండురెడ్డి, సత్యాయాదవ్, కొండన్న, భాస్కర్‌రెడ్డి, జంగయ్య, రఘురామయ్యగౌడ్, లక్ష్మి, రఘువీర్, నర్సింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న కారు: చిన్నారి దుర్మరణం

శంషాబాద్ రూరల్: ఆటోను కారు ఢీకొన్న ఘటనలో చిన్నారి మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా చెవులతండాకు చెందిన మెగావత్ భీముడు, మధు దంపతులు బతుకుదెరువు కోసం స్వగ్రామం నుంచి వచ్చి జీడిమెట్ల ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడాదిన్నర కూతురు కావ్యశ్రీ ఉంది. భీముడు ఓ సంస్థలో డెలివరి బాయ్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల కిందట వీరు స్వగ్రామం వెళ్లి తిరిగి గురువారం హైదరాబాద్ వస్తున్నారు. తన బావ మున్యకు చెందిన ఆటోలో చెల్లెలు, వారి పిల్లలతో పాటు భార్య, చిన్నారి కూడా ఉన్నారు. వెనక నుంచి భీముడు బైక్‌పై వస్తున్నాడు. వీరు పాల్మాకుల సమీపంలోకి రాగానే.. బెంగళూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో వాహనాలు నెమ్మదిగా వెళ్తున్నాయి. ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు వీరి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ఉన్న మధు, చిన్నారి కావ్యశ్రీకి గాయాలయ్యాయి. చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లగా కావ్యశ్రీ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


ప్రకాష్ (ఫైల్)

జడ్చర్ల: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని ఈర్లపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లలిత, యాదయ్యల కుమారుడు ప్రకాష్ (14) కోడ్గల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా ప్రకాష్ తమ ఇంట్లో ఇంటి తాగునీటి సంపు వద్ద గల విద్యుత్ మోటార్ ఆన్ చేసే క్రమంలో బయటకు తేలిన తీగ తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృత్యువాత పడ్డాడు. విద్యార్థి మృతిపై ఫిర్యాదు రాలేదని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

జడ్చర్ల: మండలంలోని చౌటగడ్డ తండాకు చెందిన ముడావత్ శోభ (33) మాచారం శివారులో గల పెద్ద చెరువులో అనుమానాస్పదంగా మృతి చెందిందని సీఐ రమేష్‌బాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటగడ్డతండాలో భర్త ముడావత్ పాండుతో కలిసి నివాసం ఉంటున్న శోభ గురువారం రాత్రి గణేష్ నిమజ్జనం చూసేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తర్వాత మళ్లీ ఇంటికి రాలేదు. శుక్రవారం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతంలో వెతుకగా పెద్ద చెరువులో శోభ మృతదేహం గుర్తించారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి పాత్లావత్ సాజీ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జారిపడి వ్యక్తి..

కోడేరు: మండలంలోని నాగులపల్లిలో ఓ వ్యక్తి స్నానం చేసేందుకు బాత్‌రూంకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు ఇలా.. నాగులపల్లికి చెందిన విజయ్(48) స్నానం చేయడానికి బాత్‌రూంకి వెళ్లాడు. గదిలో నీటితడి ఉండటంతో కాలుజారి తల గోడకు తగలడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కింద పడిన శబ్దం విన్న భార్య వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జూరాలకు 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శుక్రవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 8,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 117, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 450, భీమా లిఫ్ట్ -2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,078 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.214 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది.

రాజోళి: సుంకేసుల డ్యాంకు శుక్రవారం ఇన్‌ఫ్లో కొనసాగింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి 6,370 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటును తెరిచి 4,446 దిగువన ఉన్న శ్రీశైలంకు, కేసీ కెనాల్‌కు 1,616 క్యూసెక్కులు వదిలారు.

శ్రీశైలంలో 855.2 అడుగులు..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శుక్రవారం 855.2 అడుగుల వద్ద 92.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సుంకేసుల నుంచి 4,446 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 2,500, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,505, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,466 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 2.449 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 4,279 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 109 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

అర్చకులకు పునశ్చరణ తరగతులు

- అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు
- మన్యంకొండ వేదికగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో శిక్షణ


అర్చకత్వంలో శిక్షణ తరగతులు (ఫైల్)

జోగుళాంబ శక్తిపీఠం: హైందవ ధర్మానికి మూలమైన ఆలయాలల్లో ప్రతి నిత్యం ఆధ్యాత్మిక వెలుగులు, సమంత్ర పూర్వక గంటానాథానికి వీలుగా ధూప, దీప, నైవేద్యం నిర్వహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇందుకోసం ఉమ్మడి పాలమూరు జిల్లాలో ధూప, దీప, నైవేద్య పథకం కింద 653 ఆలయాలను, అర్చకులను ఎంపిక చేసింది. వీరందరికీ నిత్యం అక్కడి విధానపరమైన పూజా కార్యక్రమాలను చేసేందుకు పునశ్చరణ శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

మూడురోజుల పాటు..

మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కొండ కింద ఉన్న అమ్మవారి ఆలయం వద్ద అక్టోబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులకు ఏర్పాటు చేసినట్టు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వీణాధరి, వెంకటేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శకుంతల తెలిపారు. స్మార్థ, శైవ, పాంచరాత్ర, చాత్తాద, వైష్ణవ, తంత్రసారల ఆగమాల వారీగా శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. వైదిక స్మార్థ ఆగమం నుంచి జోగుళాంబ ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, వైఖానసం కోసం రామానుజాచార్యులు, శైవ ఆగమం-ఉమామహేశ్వర దేవస్థానం నుంచి వీరయ్య శర్మ, వీరశైవ ఆగమం- గవ్వమఠం విశ్వనాథశాస్త్రి, మహేష్, చాత్తాద శ్రీవైష్ణవ ఆగమం- మన్యంకొండలోని నరసింహాచారి, గ్రామదేవత ఆగమం-బీచుపల్లి దేవస్థానం నుంచి మారుతి ఆచారి, పాంచరాత్ర ఆగమం- కురుమూర్తి ఆలయం వెంకటేశ్వర ఆచార్యులు, వనపర్తి గ్రూప్ ఆలయాల నుంచి రామాచార్యులు, తంత్రసారం(మధ్వ) ఆగమం కోసం ఆనందతీర్థా చార్యుల ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు.

ఎంపికైన ఆలయాల వివరాలు

జిల్లాలు	తొలి విడత	రెండో విడతలో	మూడో విడత
మహబూబ్‌నగర్	33	85	113
గద్వాల	15	31	29
నాగరికర్నూల్	40	43	73
వనపర్తి	16	21	44
నారాయణపేట	30	0	80
మొత్తం	134	180	339

శిక్షణతో అర్చకులకు ఉజ్వల భవిష్యత్



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం దేవదాయశాఖ ధూప, దీప, నైవేద్య అర్చకులకు శిక్షణ తరగతులు ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద ఆలయాలలో వైభవం తీసుకొచ్చేందుకు అలాగే అర్చకుల జీవనవిధానంలో మంచి మార్పులకు ఈ శిక్షణ తరగతులు పెద్దపీట వేస్తూ, బంగారు భవిష్యత్ కల్పిస్తుంది.

–గాదిరాజు శ్రీనివాస్‌రాజు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవదాయశాఖ

సద్వినియోగం చేసుకోవాలి



కొత్తగా ఎంపికైన అర్చకులు, గతంలో ఈపథకం కింద ఉన్న అర్చకులకు ఇదో మంచి అవకాశం. ఆలయల్లో త్రికాల పూజలు ఎలా చేయాలనే విషయాలు నేర్చుకోవచ్చు. ప్రభుత్వం ప్రస్తుతం అర్చకులకు ఈ పథకం కింద వేతనాలు కూడా పెంచింది. అర్చకులు శిక్షణ తీసుకుని ఆలయంలో భక్తులకు అందుబాటులో ఉంటూ మంచి పేరుతెచ్చుకోవాలి.

–పురేందర్, గ్రేడ్–1 ఈఓ, జోగుళాంబ ఆలయం

మెరుగైన శిక్షణ తరగతులు



త్రికాల సమయాల్లో నిర్వహించే ఆరాధనలు, ఆలయాల్లో ఆధ్మాత్మిక కళ, అర్చకుల పని తీరు, హైంధవ ధర్మ స్థాపనకు అవసరమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అనేక అంశాలపై ఈ తరగతులు ఉంటాయి. భవిష్యత్‌లో మరింత మెరుగైన రీతిలో పూజా విధానాలు, నైపుణ్యతపై మరిన్ని తరగతులు కూడా నిర్వహించే అవకాశం ఉంది.

–ఆనంద్ శర్మ, డీడీఎన్ఎస్ సెలక్షన్, త్రిమెన్ కమిటీ సభ్యుడు

అందరూ హాజరు కావాలి



ప్రభుత్వం తొలిసారిగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో మంచి పునఃచరణ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసింది. ఈ తరగతులకు ఉమ్మడి జిల్లాలోని అర్చకులంతా హాజరుకావాలి. భోజన సౌకర్యాలు కూడా ఉంటాయి. ఆలయాల నిర్వహణకు ఇది మంచి అవకాశం.

–నరేంద్రచార్యులు, డీడీఎన్ఎస్ అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

భవనాలను పరిశీలించిన వీసీ


క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న బాలికల హాస్టల్, క్యాంటీన్, సైన్స్ రీసెర్చ్ ఫెసిలిటీ భవనాన్ని పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శుక్రవారం పరిశీలించారు. పనులపై కాంట్రాక్టర్లు, ఇంజినీర్లతో అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం లేకుండా ఒప్పందం ప్రకారం గడువులో పూర్తి చేయాలన్నారు. నవంబర్‌లో న్యాక్ బృందం పీయూను సందర్శించినున్న నేపథ్యంలో వీలై నంత వరకు పనులు పూర్తి చేయాలని తెలిపారు.

ఎంబీఏ, ఎంసీఏలో 73 మందికి ప్రవేశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎంబీఏ, ఎంసీఏ అర్హత పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వారికి ఇటీవల ప్రభుత్వం కౌన్సెలింగ్ నిర్వహించింది. పీయూలో ఎంబీఏ, ఎంసీఏలో చేరేందుకు విద్యార్థులకు శనివారంతో చివరి రోజు ముగుస్తుంది. శుక్రవారం సాయంత్రం నాటికి ఎంబీఏలో 39, ఎంసీఏలో 34 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. శనివారం సాయంత్రం వరకు కూడా ప్రవేశాలు తీసుకునేందుకు అవకాశం ఉంది.

'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా ఏది?

టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు వచ్చే అర్హత పీఎం నరేంద్రమోదీకి లేదని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014, 2019 ఎన్నికల ప్రచార సమయంలో మోదీ ఇచ్చిన మాటలు ఏవి నిలబెట్టుకోలేదని విమర్శించారు. 2014 ఎన్నికల సభలో దివంగత సుష్మాస్వరాజ్ పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని చెప్పారని, దానిని మోదీ ప్రభుత్వం ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. నడిగడ్డకు అన్యాయం జరిగే కర్ణాటకలో అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తే దీనిపై ఆ ప్రాంత బీజేపీ నాయకులు డీకే అరుణ, జితేందర్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదో ఒక్కసారైనా మీరు అడిగారా? అని నిలదీశారు. ఈ పదేళ్లలో దేశవ్యాప్తంగా 689 ఆహార నిల్వల కేంద్రాలు ఇచ్చిన మోదీ ప్రభుత్వం జిల్లాకు ఒక్కటి ఇవ్వలేదన్నారు. విభజన సమయంలో పార్లమెంట్‌లో చట్టం చేసి తెలంగాణకు ఐటీఆర్ ప్రాజెక్టు కాంగ్రెస్ ఇచ్చిందని, ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఉపాధి అవకాశాలు లభించేవని, దీనిని బీజేపీ ఎందుకు రద్దు చేసిందన్నారు. జిల్లాకు ఇచ్చిన సైనిక్ స్కూల్‌ను ఎందుకు రద్దు చేశారని, ఎన్‌డీఏ కళాశాలపై ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందని బీజేపీ నాయకుడు లక్ష్మణ్ మాట్లాడడం సరికాదన్నారు. బీసీల కోసం కాకా కాలేల్కర్ కమిటీని నియమించింది కాంగ్రెస్ పార్టీ అని, వీపీ సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్‌ను అమలుచేసినప్పుడు కాంగ్రెస్ సమర్థిస్తే బీజేపీ వ్యతిరేకించిందని గుర్తు చేశారు. మోదీ పర్యటనను జిల్లా ప్రజలు ని రసన తెలపాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, దిలీప్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం


రికార్డులు పరిశీలిస్తున్న జేమ్స్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జాతీయ నాణ్యత ప్రమాణాల కమిటీ డాక్టర్ సోనోం, జేమ్స్‌ల బృందం శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలో ఉండాల్సిన వసతులు, పరిశుభ్రతను చూశారు. రోగులను వసతులు, సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందిస్తున్నారా? గ్రామాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారా అనే విషయాలు ప్రజలతో ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని 14 నేషనల్ కార్యక్రమాలను గురించి ఆరా తీశారు. ముఖ్యంగా హెల్త్ న్యూట్రీషన్, శానిటేషన్, వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన చికిత్స, ప్రసవాలు వంటి వాటిని నిర్వహిస్తున్నారా? అని వైద్య సిబ్బందిని అడిగారు. ప్రజలకు సమస్యలు లేకుండా సకాలంలో అందుబాటులో ఉండాలని డాక్టర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమేష్, రామ్మోహన్, జాతీయ నాణ్యత ప్రమానాల కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తే ఉద్యమమే

- విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంమనోహర్



జెడ్పీసెంటర్ (మహబూనగర్): విద్యుత్‌శాఖలో ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంమనోహర్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్‌భవన్ ఆవరణలో ఉన్న అతిథిగృహంలో మహా ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసుల పేరుతో యాజమాన్యం మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. క్యాచ్ అప్ రూల్స్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కాన్సిడరేషన్ సీనియారిటీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి దాక రివర్షన్ ఇచ్చి ప్రతి ఉద్యోగికి ప్రమోషన్ ఇవ్వాలని కోరారు. క్యాచ్ అప్ రూల్స్‌ను ముందుకు తెచ్చి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని, ప్రస్తుతం కొనసాగిస్తున్న పద్ధతి ప్రకారం ప్రమోషన్లు కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 4వ తేదీన హైదరబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులతో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్నాకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చంద్రయ్య, రవీందర్, ఆనంద్, బీచుపల్లి, నారాయణనాయక్, గంగాధర్, గోవింద్, వెంకటన్న, పూలేనాయక్, దయానంద్, లక్ష్మయ్య, శివప్రసాద్, భాస్కర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభం


ప్రారంభానికి సిద్ధమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అధునాతనమైన వసతులతో నిర్మాణమైన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు అందుబాటులోకి వచ్చింది. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కృషితో రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో, సకల క్రీడా సౌకర్యాలతో రూ.7కోట్ల 79లక్షల నిధులతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయ్యింది. పెవిలియన్, టేబుల్ టెన్నిస్ హాల్, బాక్సింగ్ హాల్‌తోపాటు స్టోర్ రూంలు, క్రీడాకారుల వసతి గదులను ఏర్పాటు చేశారు. స్టేడియం లోపల ఉడెన్ కోర్టులో ఉడెన్‌లో బాస్కెట్‌బాల్ కోర్టు, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు ఏర్పాటు చేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీలకు వేదికగా ఈ స్టేడియంను తీర్చిదిద్దారు.

ప్రారంభించనున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఈ స్టేడియంను శనివారం రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఇండోర్‌లో ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ డబుల్ విభాగం పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి ఎల్.రవికుమార్ 9848085211, కార్యనిర్వాహక కార్యదర్శి సాదత్‌ఖాన్ 9866928835 నంబర్లను సంప్రదించాలని డీవైఎస్ఓ శ్రీనివాస్ తెలిపారు. మెయిన్ స్టేడియంలో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభమవుతుండడంతో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

రెండు ఇళ్లలో చోరీ

గద్వాల క్రైం: ఇంట్లోకి చొరబడి నగదును అపహరించిన ఘటన శుక్రవారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రవి కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బీరువాలో నిల్వ ఉంచిన రూ.5వేల నగదును అపహరించారు. విలువైన బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో అక్కడి నుంచి తప్పించుకుని వెళ్లిపోయారన్నారు. ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంట్లోని వస్తువులు, బీరువాలోని బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే కాలనీలో గల బలరాం ఇంట్లో నాలుగు తులాల బంగారం అపహరించారు. పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలం వద్దకు చేరుకుని ఆరా తీశారు. త్వరలో నిందితులను గుర్తించి తగు చర్యలు తీసుకుంటమని ఎస్ఐ తెలిపారు.

తండ్రి అంత్యక్రియలు పూర్తి చేసి వస్తుండగా..
డీసీఎం ఢీకొని కుమారుడి దుర్మరణం

- డ్రైవర్‌ను చితకబాదిన బంధువులు.. పరిస్థితి విషమం
- భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై ఘటన


భూత్పూర్ వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బంధువులు

భూత్పూర్: అనారోగ్యంతో మృతిచెందిన తండ్రి అంత్యక్రియలు నిర్వహించి వస్తుండగా డీసీఎం ఢీకొనడంతో ఓ కుమారుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనతో ఒక్కసారిగా కోపోద్రిక్తులైన బంధువులు డ్రైవర్‌ను చితకబాదడంతో అతని పరిస్థితి విషమంగా మారిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లో చోటుచేసుకుంది. వివరాలిలా.. భూత్పూర్‌కు చెందిన కోట్ల బాలయ్య అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో తిరిగి వస్తుండగా బాలయ్య కుమారుడు రాజు(25) జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్మరణం చెందాడు. పట్టణ ప్రజల కథనం మేరకు పట్టణానికి చెందిన కోట్ల బాలయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అక్కడే ఉన్న బంధువులు కోపోద్రిక్తులై డీసీఎం డ్రైవర్‌ను రాళ్లు, కర్రలతో చితకబాదారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి బంధువులు అర గంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, మత్స్య సహకా రం సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బంధువులకు నచ్చజెప్పి అక్క డి నుంచి పంపించడంతో వాహనాల రాకపోకలు సాగాయి. అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముద్దిగుబ్బకు చెందిన డీసీఎం డ్రైవర్ గోపాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

మిన్నంటిన రోదనలు

భూత్పూర్‌కు చెందిన కోట్ల బాలయ్య వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నలుగురు కుమార్తెలు, రాజు ఒకే ఒక్క కుమారుడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలయ్య గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం తండ్రి అంత్యక్రియలు చేసి వస్తున్న క్రమంలో జాతీయ రహదారి దాటుతుండగా కళ్ల ముందే ఒక్కగానొక్క కుమారుడు సైతం మృతి చెందడంతో తల్లి, అక్కాచెల్లెళ్ల రోదనలు కంటతడి పెట్టించాయి.

కల్యాణ వైభోగమే


అలంకరణలో స్వామివారి దంపతులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గర్భగుడి నుంచి స్వామివారిని ఊరేగింపుగా కల్యాణ మంటపం వరకు తీసుకువచ్చారు. అనంతరం మహోత్సవాన్ని సాంప్రదాయ రీతిలో జరిపించారు. కార్యక్రమంలో చైర్మన్ మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి పాల్గొన్నారు.

ఆలయాలకు భారీ ఆదాయం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కించగా రూ.11,63,902 వచ్చినట్లు కార్యనిర్వహణ అధికారి, దేవాదాయశాఖ సహయ కమిషనర్ వీణాధరి తెలిపారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం ఫిబ్రవరి మాసంలో హుండీ లెక్కించగా తిరిగి ఆరు నెలలకు గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో మరోసారి లెక్కించినట్లు ఆమె తెలిపారు.

ఆదిశిలా క్షేత్రం ఆదాయం రూ.18.69లక్షలు


మల్దకల్‌లో హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

మల్దకల్: మండల కేంద్రంలోని ఆదిశిలా క్షేత్రమైన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీని శుక్రవారం ఈఓ సత్యశ్చంద్రారెడ్డి, చింతరేవుల ఆలయ ఈఓ కవిత ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.18,69,471 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. లెక్కింపులో గట్టు భ్రమరాంబిక సేవా సమితి మహిళలు శ్రీదేవిగుప్తా, మహాదేవి, వర లక్ష్మి, రాజేశ్వరిలతో పాటు 50 మంది పాల్గొన్నారు.

1,200 కేజీల నల్లబెల్లం పట్టివేత

బల్మూర్: నిషేధిత నల్లబెల్లం అమ్మినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నర్సాయపల్లిలో తనిఖీ నిర్వహిస్తుండగా దేశ్యకు చెందిన 40 బస్తాల(1,200 కేజీలు) నల్లబెల్లం, 100 కేజీల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దేశ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు.